జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 18 ॥బుధవారం ॥ 17-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## ఢిల్లీలో పవన్ కల్యాణ్ బిజీ బిజీ

### ఏపీ అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కీలక భేటీలు

న్యూఢిల్లీ, జూన్ 16: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్య టన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర పురోభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల రూపురేఖల మా ర్పు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఆయన కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. జలశక్తి, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, నిధుల సాధనపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడి నివారణ, కలుషితమవుతున్న నదుల పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరువాయి 2 వ పేజీలో...

# రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- విత్తనం నుంచి కొను గోలు వరకు పర్యవేక్షణ
- ఏఐ, యాప్‌లతో వ్యవసాయ ఆధునీకరణ
- వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

**రైతులకు విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం, ఖరీఫ్ సీజన్ సన్నాహకాలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు.**



హైదరాబాద్, జూన్ 16: సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేముల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. పంటలు వేసిన దశ నుంచే రైతుల వివరాలు, పంటల విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, కొనుగోళ్ల వరకు ప్రతి అంశంపై వ్యవసాయ శాఖకు పూర్తి సమాచారం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీలో వ్యవసాయ



## జవాబుదారీతనంలో మోదీ సర్కార్ విఫలం

### పరీక్షల అక్రమాలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

### పేపర్ లీకేజీలతో కోట్లాది యువత భవిష్యత్తు ప్రమాదంలోనని ఆందోళన

న్యూఢిల్లీ, జూన్ 16: దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో చోటుచేసు కుంటున్న అక్రమాలు, పేపర్ లీకేజీల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. పేపర్ లీకేజీలు, పరీక్షలలో అవకతవకలు (మిగతా 2వ పేజీలో)



## రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

న్యూఢిల్లీ, జూన్ 16

హైదరాబాద్ మెట్రో విస్తర ణ, తెలంగాణ అభివృద్ధి అం శాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘాటుగా స్పం దించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మెట్రో ప్రాజెక్టులకు అందిస్తున్న విధంగానే హైద రాబాద్ మెట్రోకు కూడా కేంద్ర (మిగతా 2వ పేజీలో)

## గురుకులాల్లో 2,000 కోట్ల కుంభకోణం

### ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణలు

### మానకొండూరులో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

### విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల ప్రస్తావన



కరీంనగర్, జూన్ 16: గురుకుల విద్యాసంస్థల్లో రూ. 2,000 కోట్ల కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు ఆరోపించారు. మానకొండూరు నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించా రు. గురుకులాల్లో బట్టలు, బూట్ల కొనుగోళ్లకు రూ. 1,200 కోట్లు, ఆహార సరఫరాలకు సంబంధించిన ఉప్పు, పప్పు, కోడిగుడ్ల టెండర్లకు మరో రూ. 800 కోట్లతో ఒప్పందాలు కుదిరాయని, ఈ అంశాలపై తాను (మిగతా 2వ పేజీలో)




## కాంట్రాక్టర్లతో ఉప ముఖ్యమంత్రి భేటీ

### చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అండ

### పెండింగ్ బిల్లులు దశలవారీగా చెల్లింపు

### 'చలో హైదరాబాద్' కార్యక్రమం వాయిదా



## 2.3 కోట్లకు పైగా ఢిల్లీ జనాభా

న్యూఢిల్లీ, జూన్ 16 : దేశ రాజధాని ఢిల్లీ జనాభా ఊహించని స్థాయిలో పెరిగిన ట్లు జనగణన-2027 తొలి దశ సర్వేలో వెల్లడైంది. 'హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్' (మిగతా 2వ పేజీలో)

## ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం

### అమరజ్యోతిని సందర్శించిన కమిటీ సభ్యులు

### జూన్ 23 నుంచి దశలవారీ సంప్రదింపులు

### ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సూచనల స్వీకరణ

హైదరాబాద్, జూన్ 16

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాచరణను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు (మిగతా 2వ పేజీలో)



# నేటి రాశి ఫలాలు

**మేషం :** పనుల్లో కొంత జాగ్రత్త అవసరం. నిర్ణయాల్లో ఆలోచన అవసరం. ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో నియంత్రణ పాటించాలి. కుటుంబంలో చిన్నపాటి విభేదాలు రావచ్చు. నవగ్రహ శ్లోకాలు పఠించాలి.

**వృషభం :** వృత్తి, వ్యాపారాల్లో అనుకూల ఫలితాలు కనిపిస్తాయి. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ ఖర్చులను నియంత్రించడం మంచిది. కుటుంబ సభ్యుల సహకారం పనులు పూర్తి చేయడంలో తోడ్పడుతుంది. శివారాధన చేయాలి.

**మిథునం :** ఉద్యోగంలో గుర్తింపు, పురోగతి కనిపిస్తుంది. ఆర్థిక పరంగా అభివృద్ధి, లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కుటుంబంలో ఆనందకర వాతావరణం ఉంటుంది. శ్రీమహాలక్ష్మీ ప్రార్థన శ్రేయస్కరం.

**కర్కాటకం :** ఉద్యోగంలో పురోగతి సాధ్యం అవుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది. కుటుంబ విషయాల్లో సహనం అవసరం. దుర్గా నామస్మరణ మేలు చేస్తుంది.

**సింహం :** వృత్తిలో కొత్త అవకాశాలు వస్తాయి. కొత్త ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా సాధారణ లాభాలు ఉంటాయి. ప్రయాణాలు అనుకూలంగా మారతాయి. సూర్యారాధన శుభప్రదం

**కన్య :** వ్యాపారంలో లాభాలు, పనుల్లో పురోగతి కనిపిస్తుంది. ఆర్థిక పరంగా మెరుగుదల ఉంటుంది. పెట్టుబడులు జాగ్రత్తగా చేయాలి. కుటుంబంలో శాంతి ఉంటుంది. శ్రీ మహాగణపతి ధ్యానం చేయాలి.

**తుల :** పనుల్లో జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఆలస్యాన్ని తగ్గించాలి. ఆర్థికంగా సాధారణ పరిస్థితులు ఉంటాయి. కుటుంబంలో చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయి. శివనామస్మరణ శ్రేయస్కరం.

**వృశ్చికం :** వృత్తిలో లాభాలు, ఆదాయం పెరుగుతుంది. ఆర్థికంగా బలపడే సూచనలు ఉన్నాయి. కుటుంబంలో ఆనందకర పరిణామాలు ఉంటాయి. శ్రీసూర్య ధ్యానం శ్రేయస్కరం

**ధనుస్సు :** వృత్తిలో పురోగతి, గౌరవం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. శ్రీవిష్ణు సహస్రనామం పఠించాలి.

**మకరం :** ఉద్యోగ, వ్యాపారాల్లో శుభఫలితాలు కనిపిస్తాయి. ఆర్థికంగా అభివృద్ధి, స్థిరత్వం ఉంటుంది. కుటుంబంలో శుభకార్యక్రమాల సూచనలు ఉంటాయి. శ్రీలక్ష్మీ అష్టోత్తరం పారాయణం చేయాలి.

**కుంభం :** పనుల్లో సహచరుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ జాగ్రత్త అవసరం. కుటుంబంలో సమన్వయం మంచిది. నవగ్రహ శ్లోకాలు చదవాలి.

**మీనం :** ఉద్యోగంలో మంచి ఫలితాలు, గుర్తింపు లభిస్తుంది. ఆర్థికంగా శుభఫలితాలు ఉన్నాయి. ఖర్చుల విషయంలో నియంత్రణ అవసరం. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రార్థించాలి





# రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

విత్తనాల పంపిణీ, రైతుల నమోదు, పంటల రికార్డులు, ఉత్పత్తి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు అన్ని దశలను కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి గ్రామంలో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నాడనే సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు ప్రభుత్వం బోనస్ ఇస్తున్నందున ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతు వేదికల్లోనే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సన్న వడ్లు సాగు చేసే రైతుల పూర్తి డేటా సేకరించాలని సూచించారు. రైతు వేదికలను రైతులకు ఉపయోగపడే సేవా కేంద్రాలుగా తీర్చిద్దాలని, అక్కడే రైతులు తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు పొందేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో అమలు చేస్తున్న ఏఐ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను అధ్యయనం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని పేర్కొన్నారు. అలాగే ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టాలని, యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపుల కోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రామగుండం ఎఫ్‌సీఐ ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు తెలంగాణకు అధికంగా కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు.

మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, ప్రభుత్వ డెయిరీల పనితీరుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించే చర్యలు చేపట్టాలని, మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరించిన వ్యూహాలతో నష్టం తగ్గిందని పేర్కొన్నారు. ఆయిల్‌ఫెడ్‌ను లాభాల బాటలో నడిపించాలని, ప్రభుత్వ డెయిరీని మరింత బలోపేతం చేసి పాల రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. మెట్రో ఫేజ్-1 కోసం కేంద్రం ఇప్పటికే రూ. 1,250 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. తెలంగాణ కావున లేదా కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఆగిపోతాయనడం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రికి తగవని వ్యాఖ్యానించారు. తాము రేవంత్ రెడ్డికి కాదు, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాను వ్యక్తిగతంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేసిన కిషన్ రెడ్డి, రాష్ట్ర అభివృద్ధి కోసం గత 12 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందన్నారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి విషయంలో తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.రైల్వే అభివృద్ధి అంశంపై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థన కోసం ఎదురుచూడకుండా కేంద్రం బాధ్యతగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 విషయంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం సహకరించలేదని, అయినప్పటికీ కేంద్రం ముందడుగు వేసి ప్రాజెక్టును ప్రారంభించిందని తెలిపారు. తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలక ప్రాజెక్టులను కూడా కేంద్రం తీసుకొచ్చిందన్నారు. ఎన్‌సీడీసీ ద్వారా తెలంగాణకు భారీగా ఆర్థిక సహాయం అందించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 37 వేల కోట్లు మంజూరు కాగా, ఇప్పటికే రూ. 34 వేల కోట్లు రాష్ట్రానికి విడుదలైనట్లు చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అవసరమైన ఏడీబీ రుణాలకు కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రతి ప్రాజెక్టుకు కేంద్రం సహకరిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించి కేంద్రం ఎలాంటి అడ్డంకులు సృష్టించడం లేదని కిషన్ రెడ్డి తెలిపారు.

## పరీక్షల అక్రమాలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

(మొదటి పేజీ తరువాయి)

వెలుగుచూస్తున్నప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం విచారకరమని అన్నారు. జవాబుదారీ తనం విషయంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిం చారు. జూన్ 21న నిర్వహించనున్న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించడాన్ని ఖర్గే తప్పుబట్టారు. టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, కోట్లాది మంది యువత భవిష్యత్తును దెబ్బతీ సిన వ్యవస్థ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో దేశవ్యాప్త ంగా సుమారు 90 పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నాయని ఖర్గే ఆరోపించారు. ఈ ఘటనల కారణంగా దాదాపు 9 కోట్ల మంది యువత తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని,చిన్న స్థాయి నిందితులను మాత్రమే పట్టుకొని అసలు బాధ్యు లను రక్షించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పరీక్షల అక్రమాల కారణంగా అనేక మంది విద్యార్థులు మానసిక వేద నకు గురవుతున్నారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. నీట్, యూజీసీ-నెట్, ఎస్ఎస్‌సీ, సీయూఈటీ వంటి కీలక పరీక్షల్లో వరుసగా వెలుగుచూసిన అక్రమాలు యువతలో ఆందోళన పెంచాయని అన్నారు. పిల్లల విద్య కోసం అప్పులు చేసి సిద్ధం చేసిన తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల సీబీఎస్ఈ ఫలితాలపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, యూపీఎస్సీ పరీక్ష కూడా వివాదాల పరిధిలోకి రావడం ఆందోళన కలిగించే అంశమని ఖర్గే వ్యాఖ్యానించారు. పరీక్షల నిర్వహణ లో పారదర్శకత, విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమకారుల గుర్తింపు ..

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణంలోని వివిధ విభాగాలు, ప్రత్యేకంగా ఆడియో-విజువల్ గదిని కమిటీ సభ్యులు పరిశీలించారు. అనంతరం కమిటీ చైర్మన్ కె. కేశవరావు ఆధ్వర్యంలో అమరజ్యోతి కేంద్రంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాక ర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాము లు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి వివిధ వర్గాలతో దశలవారీగా సంప్రదింపులు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, వైద్యులు తదితర వర్గాల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నారు. 2001 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యమకారులు, ప్రజా సంఘాలు, ఉద్యమకారుల సంక్షేమ కమిటీలు మరియు ఇతర వర్గాలతో రాజకీయాలకు అతీతంగా విస్తృత స్థాయిలో చర్చలు జరపాలని కమిటీ నిర్ణయించింది. ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన ప్రమాణాలు, విధివిధానాల రూపకల్పనకు ఈ సూచనలు ఉపయోగపడనున్నాయి. ఈ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అభిప్రాయాలు స్వీకరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఉద్యమకారుల నుంచి నేరుగా వినతులు స్వీకరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించే చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## గురుకులాల్లో కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడితే సంబంధిత మంత్రులు సవాళ్లు విసురుతున్నారని అన్నారు. సొంత శాఖల టెండర్ల వివరాలపై మంత్రులకు కనీస అవగాహన లేదని విమర్శించారు. రైతుబంధు బకాయిల పేరుతో ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ. 19 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడు విడతలుగా రైతుబంధు చెల్లింపు లు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను దెబ్బతీసే విధంగా రైతు డిస్కమ్ పేరుతో కొత్త కుట్ర జరుగుతోందని వ్యాఖ్యానించారు. రుణమాఫీ, పెన్షన్లు, మహాలక్ష్మి, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇకపై "ఎగవేతల రేవంత్ రెడ్డి"గా పిలవాలని వ్యాఖ్యానించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవ డంతో 30 లక్షల మంది పేద విద్యార్థుల విద్యా భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం 16 వేల ఉద్యోగాలకే పరిమితమయ్యారని, పోటీ పరీక్షల దరఖాస్తు ఫీజులను పెంచి యువతపై భారం మోపారని విమర్శిం చారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు, బస్సు చార్జీలు, ఆర్టీఏ ఫీజులు పెంచి ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. మరోవైపు ఖజానా ఖాళీగా ఉందని చెబుతూ వందల కోట్ల రూపాయలతో క్యాంపు కార్యాలయాలు, ఇతర నిర్మాణాలకు ఖర్చు చేయడం విరుద్ధమని అన్నారు.

## 2.3 కోట్లకు పైగా ఢిల్లీ జనాభా

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలో సేకరించిన వివరాల ఆధారంగా ఢిల్లీ జనాభా 2.3 కోట్ల మార్క్‌ను దాటినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఢిల్లీ జనాభా 1.67 కోట్లుగా ఉండగా, గత 15 ఏళ్లలో దాదాపు 37.5 శాతం పెరుగుదల నమోదైనట్లు తాజా అంచనాలు సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న నగరీకరణ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలసలు పెరగడం ఢిల్లీ జనాభా వృద్ధికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. జనగణన-2027లో భాగంగా తొలి దశ సర్వే ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ ప్రక్రియలో అధికారులు ఢిల్లీలోని 45,863 ఎన్యూమరేషన్ బ్లాకులను సందర్శించి విస్తృత స్థాయిలో సమాచార సేకరణ చేపట్టారు. దాదాపు 76 లక్షల ఇళ్లను, 55 లక్షల కుటుంబాలను గుర్తించి వాటి వివరాలను నమోదు చేశారు. నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ భవనాలు, అద్దె ఇళ్లు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లకు సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించారు. ఈ గణాంకాల ఆధారంగానే జనాభాపై ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం వెల్లడైన జనాభా గణాంకాలు తాత్కాలికమైనవేనని జనగణన అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్న రెండో దశ 'పాపులేషన్ ఎన్యూమరేషన్' అనంతరం మాత్రమే తుది జనాభా సంఖ్య ఖరారవుతుందని పేర్కొన్నారు. రెండో దశలో ప్రతి వ్యక్తికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, వలసలు, కుటుంబ నిర్మాణం వంటి కీలక వివరాలను సేకరించనున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అధికారిక జనాభా గణాంకాలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే ఈశాన్య ఢిల్లీ అత్యధిక జనాభా కలిగిన జిల్లాగా నిలిచింది. ఈ జిల్లాలో సుమారు 28 లక్షల మంది నివసిస్తున్నట్లు అంచనా. నైరుతి ఢిల్లీలో దాదాపు 25 లక్షల జనాభా ఉన్నట్లు తేలింది.

# శ్వేత సంపాదకీయం

**బుధవారం 17-6-2026**

## ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరి స్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవలంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్ధం చేయడం లేదు. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్ధతి కానరావడం లేదు. రైతులు కూడా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండించి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసింది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్నద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమయంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభుత్వం కేవలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రకటించిన మండలాల్లో కూడా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంటకూ ధర రాక, ధర ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్ధతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలియడం లేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు.

పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమంగా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరంగా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాతమే. అవీ కొన్ని పంటలకే పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లు ఆలస్యమయ్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కెట్ ధరలే రాయితీ విత్తనాలకూ నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభా నికి ముందు నుంచీ కేంద్రం ఆదేశాలతో యూరియా, డిఎపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇంకా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. కేంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సంకేతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్ధత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి కూడా విడుదల చేయలేదు.

వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాలకే పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్నద్ధత అవసరం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరోపలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఇది క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. వారికి సక్రమంగా విత్తనాలు సరఫరాచేసి, అవే పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి. అప్పుడే సత్ఫలితాలు సాధించగలం.




## అవకాశాలకు నెలవు అమరావతి

అమరావతి, జూన్ 16: అమరావతిని నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని... జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని సీఎం చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటివి అమరావతికి ప్రత్యేకత తీసుకువస్తాయని వివరించారు. అమరావతిని ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిర్మితమవుతోందని స్పష్టం చేశారు. ఈక్విటీ, నేచర్, ఆపర్చ్యునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందన్నారు. 21 కి.మీ. కృష్ణా నది పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని..., అలాగే ఇన్నర్ – ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా నిలుస్తుందని చెప్పారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి థీమ్‌లతో అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ఒకే ఒక్క పిలుపుతో రాజధాని నిర్మాణం కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగిస్తే... వాటిని అభివృద్ధి చేసి కొంత భాగాన్ని రైతులకు తిరిగి ప్లాట్లుగా ఇచ్చామని వివరించారు. 25 ఏళ్ల క్రితం తాను ఐటీ గురించి మాట్లాడానని... ఐటీ భవిష్యత్‌ను ఆరోజే ఊహించి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవడంతో... ఇవాళ తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో అందరికన్నా ముందున్నారని సీఎం అన్నారు. ఇప్పుడు ఏఐ గురించి ఆలోచన చేస్తున్నామన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందన్నారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు ఎకరం రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందని చెప్పేందుకు సైబరాబాద్ నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనతో మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు లభించిందన్నారు.

## మెట్రో రుణం ఎందుకు ఆగిందంటే..

**రేవంత్ సర్టిఫికెట్ అక్కర్లేదు.. ప్రజలకు నేను జవాబుదారీ**

**షరతులకు రాష్ట్రం ఒప్పుకోకపోవడం వల్లే పెడింగ్**

**సీఎం రేవంత్ విమర్శలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కౌంటర్**



న్యూఢిల్లీ, జూన్ 16: హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దొడ్డిదారిన అడ్డుకుంటున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కౌంటర్ ఇచ్చారు. దొడ్డిదారిన ప్రాజెక్టులను ఆపే సంస్కృతి బీజేపీకి లేదని, అది కాంగ్రెస్ పార్టీకే ఉండొచ్చని కౌంటర్ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి మెట్రో రైలు రుణం ఎందుకు ఆగిందో స్పష్టంగా వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి అనాలోచితంగా, దుందుడుకు ధోరణితో అబద్ధాలు మాట్లాడుతున్నారని, తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీకి గానీ, తనకు గానీ రేవంత్ రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని స్పష్టం చేశారు. తాను రేవంత్ రెడ్డికి కాదు. తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ. తెలంగాణ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు మాకు పాఠాలు చెప్పనక్కర్లేదు అని తేల్చి చెప్పారు.

**షరతులకు అంగీకరించని రాష్ట్ర ప్రభుత్వం**

ఎల్అండ్‌టీ సంస్థ నుంచి మెట్రోను టేకోవర్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు రూ.15,000 కోట్లు చెల్లించాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఐఆర్ఎఫ్‌సీ వద్ద రూ.13,600 కోట్ల రుణానికి రాష్ట్రం దరఖాస్తు చేసిందన్నారు. అయితే ఇప్పటికే మెట్రో ఫేజ్-1, అలాగే ఢిల్లీ మెట్రో నష్టాల్లో ఉన్నాయని.. ఈ ప్రాజెక్టులు మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కొన్ని ప్రాథమిక షరతులు విధించిందని తెలిపారు. టికెట్లు, వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని ముందుగా మెట్రో రోజువారీ నిర్వహణకే వాడాలి. ఆ తర్వాత మిగిలిన ఆదాయంతో రుణాలను తిరిగి చెల్లించాలి అనేది కేంద్రం విధించిన నిబంధన. అయితే, దీనికి రేవంత్ ప్రభుత్వం ఒప్పుకోలేదని, మెట్రోకి వచ్చే ఆదాయంతో ముందే అప్పులు కడతామని మొండికేస్తోందని కిషన్ రెడ్డి వివరించారు. ఇలా చేస్తే నిర్వహణకు నిధులు కరవై మెట్రో మళ్లీ అప్పుల పాలవుతుందని, మెట్రో ఆర్థిక సుస్థిరత కోసమే కేంద్రం ఈ షరతు విధించిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం వల్లే రుణం ఆగిందని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

**నేను వద్దంటే ప్రాజెక్టులు ఆగవు**

తాను వద్దని చెబితే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టులు ఆపదని, ఎవరి కోసమూ కేంద్రం అభివృద్ధిని అడ్డుకోదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మెట్రో ప్రాజెక్టులకు సహకరిస్తున్నట్లే హైదరాబాద్‌కూ కేంద్రం సాయం చేస్తోందన్నారు. గతంలో ఫేజ్-1కి కూడా కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తాను పోరాటం చేశానని, ఢిల్లీలో రెండుసార్లు ధర్నా చేశానని, రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్‌కు, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని చెప్పారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం సహకరిస్తోందని, ఇటీవల తెలంగాణకు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌ఓసీ ఇచ్చిందని, వడ్డీ లేని సాస్కీ రుణాలను మంజూరు చేసిందని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లు మంజూరు చేసిందని వివరించారు. ఇన్ని చేస్తుంటే.. మోదీ ఇస్తుంటే తాను అడ్డుకుంటున్నానని సీఎం విమర్శించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి మండిపడ్డారు.



## యుద్ధమేఘాలు తొలగడంతో ధరలకు మళ్లీ రెక్కలు

**క్రమంగా పెరుగుతున్న బంగారం ధరలు**

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ):అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో బంగారానికి మళ్లీ డిమాండ్ పెరుగుతోంది. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ద్రవ్యోల్బణం భయాలు తొలగిపోయాయి. దీంతో, వడ్డీ రేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ పెంచే అవకాశాలు తక్కువని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. తమ పెట్టుబడులను యూఎస్ ట్రెజరీ బాండ్‌ల నుంచి మరింత లాభదాయకమైన బంగారం వైపు మళ్లిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయని అంటున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,540గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,38,910ల వద్ద కొనసాగుతోంది. ఏపీ, తెలంగాణలోని ప్రధాన ప్రాంతాల్లో ధరలు

దాదాపుగా ఇదే స్థాయిలో ఉన్నాయి. నిన్న దేశంలో మేలిమి బంగారం ధర ఏకంగా రూ.2,450ల మేర పెరిగిన విషయం తెలిసిందే.

## జనసేనలో చేరికల కోసం జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

**14 మందిని నియమించిన జనసేనాని పవన్ కళ్యాణ్**

అమరావతి, జూన్ 16: జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు వీలుగా 14 మంది సభ్యులతో ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ జాయినింగ్స్ కమిటీని నియమించారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభానులతో పాటు పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టి సి వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారు. ఢిల్లీ పర్యటన ముగిసిన అనంతరం ఈ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశం చేయనుండగా, ఆంధ్రప్రదేశ్ తరహాలోనే త్వరలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నారు.



# బీసీ విద్యార్థి సంఘం నూతన విద్యా సంవత్సర పోస్టర్ ఆవిష్కరణ

## సమస్యలపై యువత, విద్యార్థులు ఉద్యమించాలి: ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్, జూన్ 16**

బీసీ విద్యార్థి సంఘం నూతన విద్యా సంవత్సర పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో, జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు, నేటి యువత తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, అలాగే హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్, జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్, బీసీ సేన జాతీయ కార్యదర్శి నరాల రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు

**చిలుకూరు జూన్ 16**

చిలుకూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కై మండల పరిషత్ అభివృద్ధి అధికారి మొక్కపాటి నరసింహారావు ఆధ్వర్యంలో చిలుకూరు ఏపీజీవీబీ మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బేతవోలు శాఖల అధికారులు హాజరై రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేయటం జరిగింది. త్వరలో వారికి రుణాలు మంజూరు చేస్తామని అన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన అందరికీ రుణాలు అందుతాయి అన్నారు



# ట్రావెల్స్ బస్సులో బంగారం చోరీ కేసు ఛేదించిన ఖైరతాబాద్ పోలీసులు

**హైదరాబాద్, జూన్ 16**

ఆంధ్రప్రదేశ్ నుంచి సంగారెడ్డి జిల్లాకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణికురాలికి చెందిన బంగారు ఆభరణాల చోరీ కేసును ఖైరతాబాద్ పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి, చోరీకి గురైన సుమారు 62 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళకు చెందిన హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి. దీంతో బాధితురాలు ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో విచారణ చేపట్టిన పోలీసులు ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన తాతపూడి తెల్ల రాజా అలియాస్ రాజు (48)ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో, అతడి వద్ద నుంచి చోరీకి గురైన మొత్తం బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం, నిందితుడికి హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో నమోదైన ఆస్తి దొంగతనాల కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఎల్‌బీ నగర్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మరో రెండు దొంగతనం కేసుల్లోనూ అతడి ప్రమేయంపై విచారణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఖైరతాబాద్ పోలీసులు ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. దీర్ఘదూర బస్సు ప్రయాణాల్లో విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, బ్యాగులకు తాళాలు వేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సిబ్బందికి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రయాణ టిక్కెట్లు, సామాన్లకు సంబంధించిన వివరాలను భద్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల వేగవంతమైన దర్యాప్తుతో ఈ కేసు త్వరగా ఛేదించబడిందని అధికారులు తెలిపారు.

# 28న చలో కొడంగల్ విజయవంతం చేయండి

## డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు



**కోదాడ, జూన్ 16 :**

ఈనెల 28న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'కొడంగల్ కృతజ్ఞత అభినందన యాత్ర'ను విజయవంతం చేయాలని ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్‌క్లబ్ ఆవరణలో ఫోరం సూర్యపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకునేందుకు 'కేకే కమిటీ'ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. త్వరలోనే ఉద్యమకారులందరికీ న్యాయం జరిగేలా ఈ కమిటీ ప్రణాళికలు రచిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక చొరవ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ అభినందన యాత్రను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈ యాత్రకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

**సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు:**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవులరామారావు, భూపాల్, జోగు అంజన్న, పుల్లూరి అచ్చయ్య, తుపాకుల భాస్కర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మజహర్ పాల్గొన్నారు. అలాగే కోదాడ నియోజకవర్గ నాయకులు ఏనుగుల యల్లేశ్వరరావు, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, మునగాల మండల అధ్యక్షులు పోలంపల్లి వెంకటేశ్వర్లు, అనంతగిరి మండల అధ్యక్షులు సైదులు నాయక్, అడ్వకేట్ దావీదు, బొమ్మకంటి వీరబాబు, తోటపల్లి నాగరాజు, ఎస్.కె. భాజన్, రామకృష్ణ, యాదగిరి, సత్యనారాయణ, కోమటిరెడ్డి మోహనరెడ్డి, బోయినపల్లి సత్యనారాయణ, బిట్టు నరసయ్య, వెంకటనారాయణ, మండవ నాగేశ్వరావు, కన్నెబోయిన ఏడుకొండలు, మోహన్రావు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల స్థానంలో స్కామ్‌లు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ధ్వజం



**హైదరాబాద్, జూన్ 16**

రాష్ట్రంలోని రైతులకు, విద్యార్థులకు, యువతకు, బలహీన వర్గాలకు ఇచ్చిన ప్రధాన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మరోవైపు పన్నులు, ఇతర ఛార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ లీడర్ తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని అల్గనూర్ గ్రామంలో గల లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహా పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో మానకొండూరు బీఆర్ఎస్ కార్యకర్తలు అత్యంత కీలక పాత్ర పోషించారని, 2001లో పార్టీ ఆవిర్భావం నుండి ఈ నియోజకవర్గం పార్టీకి బలమైన కోటగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతో అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కనబెట్టి స్కామ్‌లకు తెరలేపిందని, పౌరసరఫరాలు, సింగరేణి, విద్యుత్, భూ లావాదేవీలతో పాటు గురుకుల విద్యాసంస్థల సంక్షేమ కార్యక్రమాల్లోనూ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. గురుకులాల్లో జరుగుతున్న అక్రమాలను ప్రస్తావిస్తూ.. విద్యార్థుల యూనిఫారాలు, షూస్ కోసం దాదాపు ₹1,200 కోట్లు, ఆహార సరఫరా (ఫుడ్ సప్లైస్) కోసం ₹800 కోట్ల విలువైన టెండర్లను నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని విమర్శించారు. తమ శాఖల్లో జరుగుతున్న టెండర్ల వివరాలు కనీసం సంబంధిత మంత్రులకు కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. రైతుబంధు సహాయానికి సంబంధించి ప్రభుత్వం మూడు విడతల నిధులను ఎగ్గొట్టిందని, రైతులకు దాదాపు ₹19,000 కోట్లు బకాయి పడిందని హరీష్ రావు ఆరోపించారు.

# విశ్వవిద్యాలయాలలో నాణ్యమైన పరిశోధనలు జరగాలి

## ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, జూన్ 16**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలోని నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ క్యాంపస్‌లో "ఇన్‌ఫ్లిబ్‌నెట్ రీసెర్చ్ సర్వీసెస్" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఏఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చక్రపాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలంటే విద్యావేత్తలు ఉన్నత స్థాయి పరిశోధనలు చేయాలని, ఆ పరిశోధనా ఫలితాలను పాఠ్యప్రణాళికలో (కరికులమ్) చేర్చాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంస్థ పరిశోధనలకు అవసరమైన ఎన్నో సాధనాలను, సేవలను అందిస్తోందని, వాటిని అధ్యాపకులు, పరిశోధకులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో పరిశోధనా రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త మార్గాలను, అవకాశాలను సృష్టించాల్సిన అవసరం ఉందని.. అందుకోసం పరిశోధనాధారిత జ్ఞానం, నైపుణ్యాలు, విలువల వారసత్వం మరియు జవాబుదారీతనంతో కూడిన నూతన విధానాలను అవలంబించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇతర విశ్వవిద్యాలయాలతో పోలిస్తే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పరిశోధనలు ఎంతో సమగ్రంగా, క్రమబద్ధంగా జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ఇతర సంస్థల అధ్యాపకులు సైతం అంగీకరిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. అకడమిక్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ. సుధారాణి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పరిశోధక విద్యార్థులు (రీసెర్చ్ స్కాలర్స్) నాణ్యమైన పరిశోధనా పత్రాలను సమర్పించేందుకు వీలుగా ఇటువంటి పలు వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇన్‌ఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ ప్రొఫెసర్ దేవిక పి. మదల్లి వర్చువల్ విధానంలో (ఆన్‌లైన్) పాల్గొని ప్రసంగించారు. ఇన్‌ఫ్లిబ్‌నెట్ ద్వారా అందుతున్న సేవలను వివరిస్తూ.. పరిశోధనల్లో కాపీరైట్ (ప్లాజియరిజం) సమస్యలను ఎలా అధిగమించాలి, సమాచారం మరియు డేటాను సేకరించే సరైన పద్ధతులపై ఆమె అవగాహన కల్పించారు. వర్సిటీ డిజిటల్ లెర్నింగ్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి విశ్వవిద్యాలయం తీసుకుంటున్న చొరవలను, ఈ వర్క్‌షాప్ ప్రాధాన్యతను సి.ఎస్.టి.డి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. శ్రీదేవి వివరించారు. రీసెర్చ్ డివిజన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.వెంకటయ్య, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఏఆర్డీ ప్రసాద్ గౌరవ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం జరిగిన సాంకేతిక సెషన్లలో ఇన్‌ఫ్లిబ్‌నెట్ శాస్త్రవేత్తలు డాక్టర్ అభిషేక్ కుమార్ 'శోధ్ చక్ర' గురించి, కె.మనోజ్ కుమార్ 'శోధ్ గంగ' గురించి, డాక్టర్ సురభి 'శోధ్ శుద్ధి' గురించి మరియు పల్లబ్ ప్రధాన్ 'ఐరిన్స్' గురించి సమగ్రమైన ప్రెజెంటేషన్లను అందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్లు, డీన్లు, అధ్యాపకులు మరియు పరిశోధక విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈగిల్ ఫోర్స్ ఆపరేషన్‌లో భారీ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

## పలువురు నిందితుల అరెస్ట్..

### అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

**హైదరాబాద్, జూన్ 16**

తెలంగాణ పోలీసుల ప్రత్యేక యాంటీ నార్కోటిక్స్ విభాగమైన ఈగిల్ ఫోర్స్ (Elite Action Group for Drug Law Enforcement -- EAGLE) మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిర్వహిస్తున్న ప్రత్యేక ఆపరేషన్లలో కీలక విజయాలు సాధిస్తోంది. ఇటీవల చేపట్టిన దాడులు, దర్యాప్తుల్లో పలువురు డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారులను అరెస్టు చేసి భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న నెట్‌వర్క్‌లపై ఈగిల్ ఫోర్స్ ప్రత్యేక నిఘా పెట్టి వరుస దాడులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల అంతర్జాతీయ హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్ ముఠాను ఛేదించి పలువురిని అరెస్టు చేసింది. థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ నెట్‌వర్క్ ద్వారా హైదరాబాద్ సహా పలు నగరాలకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. మరో ఆపరేషన్‌లో మత్తు పదార్థం మెఫెడ్రోన్ తయారీ కేంద్రాన్ని గుర్తించి ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు గణనీయమైన పరిమాణంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు.

అలాగే గంజాయి, ఎండీఎంఏ, కొకైన్ తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కూడా ఈగిల్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ఈగిల్ ఫోర్స్ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు యువతలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ ముఠాలపై కొనసాగుతున్న ఈ ప్రత్యేక ఆపరేషన్లు రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు కీలకంగా మారాయని పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజలకు మెరుగైన సేవ చేయడమే మున్సిపల్ పాలక మండలి లక్ష్యం

**చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత**

**సాధారణ సమావేశంలో 12 అజెండా అంశాలకు ఆమోదం**

**యూజీడీ పనుల ఆలస్యంపై కౌన్సిలర్ల తీవ్ర ఆగ్రహం**

**రాష్ట్ర స్థాయి అవార్డు సాధించిన చైర్‌పర్సన్, కమిషనర్‌కు అభినందనలు**



సూర్యాపేట, జూన్ 16

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్ పాలక మండలి కట్టుబడి పనిచేస్తోందని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో 'ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు' వచ్చిన సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డిలను కౌన్సిల్ సభ్యులు ఘనంగా అభినందించారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన 12 ముఖ్యాంశాలపై చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు తమ పాలకమండలి ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

**జీరో అవర్‌లో యూజీడీ పనులపై కౌన్సిలర్ల ఫైర్!**

అనంతరం జరిగిన జీరో అవర్‌లో కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పట్టణంలో సాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (ఖ+ణ) పనుల తీరుపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పబ్లిక్ హెల్త్ డీఈ రమాదేవిపై పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పనుల్లో వేగం పెంచాలని, పర్యవేక్షణ లోపించిందని మండిపడ్డారు. నాణ్యత ముఖ్యం (37వ వార్డు – భైరు శైలేందర్): కాంట్రాక్టర్లు చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. ప్రజల ఇబ్బందులు (38వ వార్డు – గండూరి రమేష్): డ్రైనేజీ పనుల ఆలస్యం వల్ల ప్రజలు నరకం చూస్తున్నారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఆరు నెలలుగా గుంతలు (42వ వార్డు – అంగిరేకుల నాగార్జున): యూజీడీ కోసం తవ్విన గుంతలను ఆరు నెలలైనా పూడ్చకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కౌన్సిలర్లు ఫోన్ చేసినప్పుడు అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలి. సాంకేతిక లోపాలు (40వ వార్డు – కొణతం రాజేష్): డ్రైనేజీ పనుల్లో ఎలాంటి సాంకేతిక ప్రమాణాలు పాటించడం లేదు. ప్రణాళిక లేకుండా మ్యాన్‌హోల్స్ తవ్వుతున్నారు. రోడ్ల పునరుద్ధరణ లేదు (35వ వార్డు – జ్యోతి శ్రీవిద్య): మొదటి విడత యూజీడీ పనులు పూర్తయిన చోట కూడా రోడ్ల పునరుద్ధరణ సరిగా చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య ప్రాంతాల్లో వేగం పెంచాలి (48వ వార్డు – వెలుగు వెంకన్న): తమది పూర్తిగా వ్యాపార ప్రాంతం కావడంతో వ్యాపారులు, కస్టమర్లు ఇబ్బంది పడకుండా యూజీడీ పనులను త్వరగా ముగించాలి. కనెక్షన్లు ఇవ్వాలి (16వ వార్డు – జహీర్): జాకీర్ హుస్సేన్ నగర్, శ్రీనగర్ కాలనీల్లో పైప్‌లైన్ పనులు పూర్తయినా మ్యాన్‌హోల్స్ కట్టలేదు, వెంటనే ఇంటర్నల్ కనెక్షన్లు ఇవ్వాలి.

**అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు**

సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు అంశం కూడా చర్చకు వచ్చింది. నిజమైన పేదలకే ఇవ్వాలి (3వ వార్డు – పడిదల సైదులు, 47వ వార్డు – కుమ్మరికుంట వేణు): ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు లేకుండా నిజమైన నిరుపేదలకే ప్రాధాన్యం దక్కేలా చూడాలి. పార్టీలకతీతంగా కేటాయింపులు (18వ వార్డు – డాక్టర్ ఊర రామ్మూర్తి): గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. సూర్యాపేట పట్టణంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి. అలాగే పట్టణంలో దోమల నివారణకు విస్తృతంగా చర్యలు చేపట్టాలి.

**అధికారుల హామీ:**

కౌన్సిలర్లు లేవనెత్తిన ప్రతి సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించారు. సమస్యలను దశలవారీగా, త్వరితగతిన పరిష్కరిస్తామని సభకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. షఫీ ఉల్లా, మున్సిపల్ ఈఈ కిరణ్, డీఈ ప్రణయ్ కుమార్, టీపీఓ సోమయ్య, మేనేజర్ బుచ్చిబాబు, ఆర్వో కల్యాణి, పబ్లిక్ హెల్త్ డీఈ రమాదేవి, అనిల్, ఎం.డి. గౌసుద్దీన్, ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్‌లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

సూర్యాపేట, జూన్ 16

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సంఘటనలపై సమాచారం అందిన వెంటనే బాధితుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించడం, అవసరమైతే అక్కడి నుంచే కేసులు నమోదు చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డయల్–100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను కట్టడి చేయాలని, జాతీయ రహదారిపై భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు సహకారం లభిస్తుందని పేర్కొంటూ, ప్రజలను వాటి ఏర్పాటుకు ప్రోత్సహించాలని అన్నారు. రాత్రి వేళల్లో బీట్, పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు భద్రత కల్పించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ




## ప్రభుత్వ విద్య అందరికీ అందుబాటులో ఉండాలి: విమలక్క

**ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలి**

హైదరాబాద్, జూన్ 16

ఎన్నికల ముందు విద్యారంగంపై ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలను నిలిపివేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు ఎఱఋఖ్రీఌఎఌ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి తొకాలతో కలిసి మాట్లాడిన విమలక్క, విద్య, వైద్యం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతలని పేర్కొన్నారు. ఈ రెండు రంగాలను బలోపేతం చేస్తే సంక్షేమ పథకాల అవసరం కూడా తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ప్రతిపాదనలను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. అలాంటి నిర్ణయం పేద పిల్లల విద్యావకాశాలను దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ౘా. =వఋుత్ర =వ౦ఎ౦ఎ కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివారని గుర్తు చేస్తూ, ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విద్య భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన విమలక్క, గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పౌరసంఘాలు, విద్యా పరిరక్షణ కమిటీలతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. "ప్రభుత్వ విద్య ప్రతి చిన్నారికి అందుబాటులో ఉండాలి" అని విమలక్క స్పష్టం చేశారు.

## మావోయిస్టులు మా పార్టీలో కూడా ఉన్నారు

**కవిత వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో చర్చ**

మంచిర్యాల, జూన్ 16

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. శ్రీరాంపూర్‌లోని ఆర్కే–7 అండర్‌గ్రౌండ్ బొగ్గు గనిలో నిర్వహించిన "బొగ్గు బాయి" కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, "మావోయిస్టులు మా పార్టీలో కూడా ఉన్నారు" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమం సందర్భంగా కవిత, పార్టీ కార్యకర్తలు, కార్మిక సంఘాల నాయకులను గని ప్రాంగణంలోకి పోలీసులు అనుమతించకపోవడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. స్వల్ప వాగ్వాదం అనంతరం వారు గేట్లు దాటి గని సమీపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన కవిత, సింగరేణి యాజమాన్యం కార్మికులకు తాగునీరు సహా కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. కార్మికులపై వేధింపులు జరుగుతున్నాయని విమర్శించారు. మావోయిస్టు ప్రభావం పూర్తిగా అంతరించిపోయిందనే అభిప్రాయాలను ఆమె ఖండించారు. "మావోయిస్టులు మా పార్టీలో కూడా ఉన్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కార్మికులపై అన్యాయం జరిగితే తమ పార్టీ సహించదని, అవసరమైతే చట్టపరమైన పోరాటం కూడా చేస్తామని కవిత హెచ్చరించారు. ఇటీవల దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అజ్ఞాత జీవితం గడిపి ప్రధాన స్రవంతిలోకి వచ్చిన మాజీ సీనియర్ మావోయిస్టు నాయకుడు తిప్పిరి తిరుపతిను కవిత పరామర్శించడం చర్చనీయాంశంగా మారాయి.

## అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**తహసిల్దార్లు, సూపర్వైజర్లు, టెక్నికల్ సిబ్బందితో శిక్షణ**

**కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెల్లడి**



సూర్యాపేట జూన్ 16

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు మరియు నకిలీ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా దాదాపు 24 సంవత్సరాల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, నెల రోజుల పాటు నిర్వహించే ఓటరు ప్రత్యేక సవరణ డ్రైవ్‌కు సంబంధించిన విధి విధానాలను వివరించారు. జూన్ 25 నుండి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై, జూలై 24 వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి 'హౌస్ టు హౌస్' సర్వే నిర్వహిస్తారని ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను అందిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షేత్రస్థాయిలోనే 'బిఎల్‌ఓ యాప్' ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వేలో ప్రధానంగా 2022 నాటికి ఓటరుగా నమోదై, ప్రస్తుతం ఉన్న వారి వివరాలను ధృవీకరిస్తారని, ఒకవేళ 2022 నాటికి ఓటరు జాబితాలో పేరు లేకపోతే, వారిని తల్లి లేదా తండ్రి వివరాలతో మ్యాపింగ్ చేస్తారని స్పష్టం చేశారు. ఓటరు పేరు, తండ్రి పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఈ సవరణల ప్రకారం వాటిని సరిచేస్తారన్నారు. చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తారని, నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సరైన సమాధానం లేదా ఆధారాలు ఇవ్వకపోతే ఓటును తొలగిస్తారని చెప్పారు. తుది డ్రాఫ్ట్ జాబితాలో పేరు నమోదైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామని, ఇందులో ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత ఆర్డీఓలునోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి లేదా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చిన వారు తమ అడ్రస్ మార్చుకోవడానికి ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల గుర్తింపు కార్డులను ఆధారాలుగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటించే నాటికి ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితా తయారీకి బిఎల్‌ఓలు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవోలు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ వి రమేష్ తహసీల్దార్లు ఏఎల్ఎంటి లు సూపర్వైజర్లు, టెక్నికల్ తదితరులు పాల్గొన్నారు

# కల్తీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం

నాగర్‌కర్నూల్, జూన్ 16

జిల్లాలో కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టేం దుకు అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్), మన గ్రోమోర్ కేంద్రం, పలు ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్‌తో కలిసి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతుల ను మోసం చేసే విధంగా కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందేలా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని తెలిపారు. ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు అవసరమైన లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయి స్తున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని రైతులకు సూచించారు. యూరియా పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా తగినంత నిల్వలు ఉంచాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. ఆన్‌లైన్ పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలని ఆదేశించారు. పంపిణీ కేంద్రాల వద్ద భద్రతా సమస్యలు తలెత్తిన సందర్భాల్లో పోలీసుల సహకారం తీసుకోవాలని ప్యాక్స్, గ్రోమోర్ ప్రతినిధులకు సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, వ్యవసాయ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.






# ఫ్లెక్స్ ఫ్యూయెల్ బైక్‌లపై రూ.4 వేల తగ్గింపు

**న్యూఢిల్లీ, జూన్ 16**

ఫ్లెక్స్ ఫ్యూయెల్ సాంకేతికతతో కూడిన ద్విచక్ర వాహనాల విక్రయాలను ప్రోత్సహించేందుకు హీరో మోటోకార్ప్ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ ఫ్యూయెల్, హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయెల్ మోడళ్లపై రూ.4,000 వరకు తగ్గింపును అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఆఫర్ 2026 జులై వరకు అందుబాటులో ఉండనుంది. తగ్గింపు అనంతరం స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ ఫ్యూయెల్ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.82,710 నుంచి రూ.78,710కు తగ్గగా, హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయెల్ ధర రూ.72,792 నుంచి రూ.68,792కు చేరింది. దీంతో ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతను ఉపయోగించాలనుకునే వినియోగదారులకు ఈ బైక్‌లు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు మోడళ్లు ఈ85 ఇంధనంపై పనిచేస్తాయి. అంటే 85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్ మిశ్రమాన్ని ఉపయోగించే విధంగా రూపొందించారు.



# డెబిట్ కార్డుతో ఉచిత ప్రమాద బీమా

**హైదరాబాద్, జూన్ 16**

డిజిటల్ చెల్లింపులు, యూపీఐ వినియోగం పెరగడంతో డెబిట్ కార్డుల వాడకం తగ్గిపోయినప్పటికీ, వాటితో లభించే ఉచిత ప్రమాద బీమా ప్రయోజనం గురించి చాలా మందికి తెలియదు. సాధారణంగా డెబిట్ కార్డును కేవలం ఏటీఎంలలో నగదు ఉపసంహరణ కోసం మాత్రమే ఉపయోగిస్తారని భావిస్తారు. అయితే చాలా బ్యాంకులు తమ డెబిట్ కార్డులతో పాటు ప్రమాద బీమా సదుపాయాన్ని కూడా అందిస్తున్నాయి. ప్రస్తుతం వీసా, రూపే, మాస్టర్ కార్డ్ వంటి వివిధ రకాల డెబిట్ కార్డులు అందుబాటులో ఉన్నాయి. కార్డు రకం, వేరియంట్‌ను బట్టి బీమా కవరేజీ మారుతూ ఉంటుంది. సాధారణ కార్డులపై రూ.2 లక్షల వరకు బీమా లభించగా, కొన్ని ప్రీమియం కార్డులపై మరింత అధిక కవరేజీ అందుబాటులో ఉంటుంది. అయితే ఈ బీమా ప్రయోజనాన్ని పొందాలంటే కార్డును నిర్దిష్ట కాలవ్యవధిలో ఉపయోగించి ఉండాలి. చాలా బ్యాంకులు ప్రమాదం సంభవించే ముందు 90 రోజుల లోపు కార్డు వినియోగం ఉండాలని నిబంధన విధిస్తాయి. ప్రస్తుతం చాలా మంది డెబిట్ కార్డును యూపీఐతో అనుసంధానం చేసిన తర్వాత ప్రత్యక్షంగా ఉపయోగించడం తగ్గించడంతో, భవిష్యత్తులో బీమా క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. కార్డు వినియోగం అంటే కేవలం నగదు ఉపసంహరణ మాత్రమే కాదు. ఏటీఎంలో బ్యాలెన్స్ తెలుసుకోవడం, చిన్న ఖాతా వివరాలు చూడడం, ఇతర సేవలను వినియోగించడం కూడా కార్డు వినియోగంగానే పరిగణించే సందర్భాలు ఉన్నాయి. దీంతో కార్డు క్రియాశీలంగా ఉన్నట్లు నమోదు అవుతుంది. కార్డుదారుడు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో, బ్యాంకు నిబంధనల ప్రకారం అర్హతలు పూర్తి చేస్తే కుటుంబ సభ్యులు లేదా నామినీ బీమా మొత్తాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇది కుటుంబానికి ఆర్థిక భరోసాను అందించగల ముఖ్యమైన ప్రయోజనంగా భావిస్తున్నారు. అయితే బీమా మొత్తం, అర్హత ప్రమాణాలు, క్లెయిమ్ విధానం, కాలపరిమితి వంటి అంశాలు బ్యాంకు నుంచి బ్యాంకుకు, కార్డు నుంచి కార్డుకు మారుతూ ఉంటాయి. అందువల్ల డెబిట్ కార్డుదారులు తమ కార్డుపై లభించే బీమా కవరేజీ, నిబంధనలు, క్లెయిమ్ ప్రక్రియ గురించి సంబంధిత బ్యాంకును సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఈ20 ఇంధనంపై తప్పుడు ప్రచారం.. కేంద్రం ఖండన

**న్యూఢిల్లీ, జూన్ 16**




ఈ20 ఇంధనం వినియోగిస్తే వాహన బీమా క్లెయిమ్‌లు తిరస్కరించే అవకాశం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఈ20 ఇంధనం వాడినంత మాత్రాన వాహన బీమా పాలసీలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. పత్రికా సమాచార విభాగం వాస్తవ నిర్ధారణ విభాగం సామాజిక మాధ్యమ వేదికలో స్పందిస్తూ.. ఈ20 ఇంధనం కారణంగా బీమా క్లెయిమ్‌లను తిరస్కరిస్తారన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొంది. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక వనరుల ద్వారా మాత్రమే సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది. దేశంలో ఇథనాల్ మిశ్రమ ఇంధన వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఇంధన భద్రతను పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ20 ఇంధనం ఇప్పటికే దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చింది. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ85 ఇంధనాన్ని కూడా కేంద్రం ప్రారంభించింది. ప్రస్తుతం 48 ఇంధన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ ఇంధనాన్ని 2026 చివరి నాటికి 500 కేంద్రాలకు, 2027 చివరి నాటికి 5 వేల కేంద్రాలకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఈ20 ఇంధనం వినియోగంపై వస్తున్న తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.

# బంగారం ధరలు తగ్గుముఖం

**హైదరాబాద్, జూన్ 16**



బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఊరట లభించింది. మంగళవారం బంగారం ధరలు తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.160, 22 క్యారెట్ల బంగారంపై రూ.150, 18 క్యారెట్ల బంగారంపై రూ.120 మేర తగ్గుదల నమోదైంది. ఉదయం మార్కెట్ ముగింపు సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,370గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,38,750కు, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,530కు లభిస్తోంది. తెలంగాణలో వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కడప, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ.1, 51, 370, 22 క్యారెట్ల బంగారం రూ.1,38, 750, 18 క్యారెట్ల బంగారం రూ.1, 13, 530 వద్ద విక్రయమవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నై, కోయంబత్తూరులో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే అధికంగా నమోదయ్యాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,53,380, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,600 వద్ద కొనసాగుతోంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వడోదరా నగరాల్లో హైదరాబాద్‌కు సమానంగా ధరలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో స్వల్ప హెచ్చుతగ్గులు, డాలర్ మారకం విలువ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో ధరలు మారుతున్నాయని బులియన్ వ్యాపారులు తెలిపారు.




## బంగారం బాండ్ల పెట్టుబడిదారులకు
# కనకవర్షం


**న్యూఢిల్లీ, జూన్ 16**

సావరీన్ గోల్డ్ బాండ్ 2020-21 సిరీస్-3లో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభాలు దక్కనున్నాయి. ఐదేళ్ల క్రితం గ్రాము బంగారంపై రూ.4,627 పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు గ్రాముకు రూ.14,774 చొప్పున చెల్లించనున్నట్లు భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించింది. దీంతో పెట్టుబడిదారులు ఏకంగా 219 శాతానికి పైగా లాభం పొందనున్నారు. 2020 జూన్ 16న విడుదలైన ఈ బాండ్లలో ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెట్టిన వారికి గ్రాముకు రూ.4,627, ఇతర మార్గాల్లో కొనుగోలు చేసిన వారికి రూ.4,677 ధర నిర్ణయించారు. ప్రస్తుతం ఐదేళ్ల లాక్-ఇన్ కాలం పూర్తవడంతో ముందస్తు ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గ్రాముకు రూ.14,774 విమోచన ధరను నిర్ణయించింది. దీంతో గ్రాముపై రూ.10,147 వరకు లాభం దక్కనుంది. ఉదాహరణకు అప్పట్లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు సుమారు రూ.3.19 లక్షల వరకు విలువ లభించనుంది. దీనికి అదనంగా ఐదేళ్ల కాలంలో ప్రతి ఏడాది 2.5 శాతం చొప్పున వడ్డీ కూడా అందింది. దీంతో మొత్తం రాబడి మరింత పెరిగింది. సావరీన్ గోల్డ్ బాండ్లకు మొత్తం ఎనిమిదేళ్ల గడువు ఉంటుంది. అయితే ఐదేళ్లు పూర్తైన తర్వాత ముందస్తుగా నగదుగా మార్చుకునే అవకాశం ఉంటుంది. ఈ బాండ్ల విమోచన ధరను ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ ప్రకటించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధరల సగటు ఆధారంగా ఆర్‌బీఐ నిర్ణయిస్తుంది.

## భారత్‌లోకి స్కోడా కోడియాక్
# ఆర్ఎస్

**న్యూఢిల్లీ, జూన్ 16**

భారత ఆటోమొబైల్ మార్కెట్లో స్కోడా తన సరికొత్త కోడియాక్ ఆర్ఎస్ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. ప్రపంచ వ్యాప్తంగా 50 ఏళ్ల రేసింగ్ వారసత్వం, 125 ఏళ్లకు పైగా మోటార్‌స్పోర్ట్స్ అనుభవాన్ని ప్రతిబింబించే ఈ వాహనం భారత్‌లో 'ఆర్ఎస్' గుర్తుతో విడుదలైన తొలి 7-సీటర్ లగ్జరీ ఎస్‌యూవీగా నిలిచింది. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇది దేశంలోనే అత్యంత వేగవంతమైన స్కోడా వాహనంగా గుర్తింపు పొందనుంది. గతంలో విడుదలైన ఆక్టేవియా ఆర్ఎస్‌కు లభించిన విశేష ఆదరణను దృష్టిలో ఉంచుకుని, కోడియాక్ ఆర్ఎస్ బుకింగ్‌లను జూన్ 22 నుంచి ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రకటించింది. వేగం, విలాసవంతమైన సౌకర్యాలు, ఏడుగురు ప్రయాణికులకు అనువైన విశాలమైన స్థలం, ఆధునిక భద్రతా వ్యవస్థలతో ఈ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రేసింగ్ స్ఫూర్తితో రూపొందించిన ఈ ఎస్‌యూవీలో అత్యాధునిక నాలుగు చక్రాల డ్రైవ్ వ్యవస్థను అందించారు. సాధారణ రహదారులతో పాటు కఠినమైన మార్గాల్లోనూ సమర్థవంతంగా ప్రయాణించేలా ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. కోయంబత్తూర్‌లో నిర్వహించిన రేస్ ట్రాక్ పరీక్షల్లో స్కోడా వాహనాలు నమోదు చేసిన రికార్డులు సంస్థ ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని చాటాయని కంపెనీ పేర్కొంది. పనితీరు, ఖచ్చితత్వం, బలమైన ఆఫ్‌రోడ్ సామర్థ్యాలను కోరుకునే వినియోగదారులకు కోడియాక్ ఆర్ఎస్ ఉత్తమ ఎంపికగా నిలుస్తుందని సంస్థ అభిప్రాయపడింది.



# భారీ బ్యాటరీతో రెడ్‌మీ టర్బో 5 విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 16**



స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో రెడ్‌మీ మరో శక్తివంతమైన ఫోన్‌ను ఆవిష్కరించింది. 'రెడ్‌మీ టర్బో 5' పేరుతో విడుదలైన ఈ పరికరంలో భారీ 7,540 ఎంఏహెచ్ బ్యాటరీ, అధునాతన మీడియాటెక్ డైమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్‌ను అందించారు. అధిక పనితీరు కోరుకునే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ ఫోన్‌ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ ఫోన్‌లో 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ తెర, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, గరిష్ఠంగా 3,500 నిట్స్ ప్రకాశం సదుపాయం కల్పించారు. డైమెన్సిటీ 8500 అల్ట్రా చిప్‌సెట్‌తో పాటు ఎల్పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, యూఎఫ్ఎస్ 4.1 నిల్వ వ్యవస్థను అందించారు. దీంతో గేమింగ్, మల్టీటాస్కింగ్ పనితీరు మరింత వేగంగా ఉంటుందని కంపెనీ పేర్కొంది. అలాగే దుమ్ము, నీటి నిరోధకత కోసం ఐపీ66, ఐపీ68, ఐపీ69 ప్రమాణాలను కల్పించారు. ఛాయాచిత్రాల కోసం 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 ప్రధాన కెమెరా, 8 మెగాపిక్సెల్ అల్ట్రా వైడ్ కెమెరా ఏర్పాటు చేశారు. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 20 మెగాపిక్సెల్ ముందువైపు కెమెరా అందించారు. నాలుగు కే వీడియో రికార్డింగ్‌కు కూడా ఈ ఫోన్ మద్దతు ఇస్తుంది. భారీ 7,540 ఎంఏహెచ్ బ్యాటరీతో పాటు 100 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్, 27 వాట్ల రివర్స్ ఛార్జింగ్ సదుపాయాలను కల్పించారు. 8 జీబీ ర్యామ్, 256 జీబీ నిల్వ కలిగిన మోడల్ ధర రూ.37,999గా నిర్ణయించగా, 12 జీబీ ర్యామ్, 256 జీబీ నిల్వ కలిగిన మోడల్ ధర రూ.40,999గా ప్రకటించారు. ఎస్బీఐ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకుల కార్డులతో కొనుగోలు చేసే వారికి రూ.2,000 వరకు తగ్గింపు లభించనుంది.




# డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై పన్ను పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 16**

: మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశీయ ఇంధన లభ్యతకు భంగం కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, విమాన ఇంధనం ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ లాభాల పన్నును పెంచుతూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పెట్రోల్‌పై ఉన్న పన్నును యథాతథంగా కొనసాగించింది. జూన్ 16 నుంచి అమల్లోకి వచ్చే తాజా నిర్ణయం ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13.50 నుంచి రూ.14కు పెంచారు. అలాగే విమాన ఇంధనం ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.9.50 నుంచి రూ.12.50కు పెంచినట్లు ప్రకటించారు. పెట్రోల్ ఎగుమతులపై మాత్రం లీటరుకు రూ.1.50 సుంకాన్ని యథాతథంగా కొనసాగించారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, అమెరికా జోక్యంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో చమురు సంస్థలు దేశీయ అవసరాలను పక్కనబెట్టి అధిక లాభాల కోసం విదేశాలకు ఇంధనాన్ని భారీగా ఎగుమతి చేయకుండా నిరోధించడమే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో దేశీయ మార్కెట్లో ఇంధన సరఫరా స్థిరంగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అయితే విమాన ఇంధనంపై పన్ను పెంపు కారణంగా విమానయాన రంగంపై కొంత ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన కొత్త సుంకాలు వచ్చే 15 రోజుల పాటు కొనసాగనున్నాయి.




# పీఎఫ్ సొమ్ము వెనక్కి తీసుకోలేరు: హైకోర్టు

**హైదరాబాద్, జూన్ 16**

ఉద్యోగికి చట్టబద్ధంగా చెల్లించిన భవిష్యనిధి సొమ్మును తిరిగి వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనల ఉల్లంఘన జరిగితే దానికి బాధ్యత యాజమాన్యం లేదా సంబంధిత ట్రస్ట్‌పైనే ఉంటుందని, ఉద్యోగిపై కాదని తేల్చిచెప్పింది. జెవి నృపేందర్‌రావు అనే ఉద్యోగికి సంబంధించిన కేసును విచారించిన న్యాయస్థానం ఈ కీలక తీర్పు వెలువరించింది. ఆయన పనిచేసిన సంస్థకు సొంత భవిష్యనిధి ట్రస్ట్ ఉండగా, 2023లో మినహాయింపు హోదాను సంస్థ రద్దు చేసుకుంది. అనంతరం ఉద్యోగికి రూ.2.50 కోట్ల భవిష్యనిధి సొమ్ము చెల్లించింది. అయితే మినహాయింపు హోదా రద్దైన తర్వాత నేరుగా చెల్లింపులు జరపడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ ఉద్యోగి నుంచి ఆ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఈపీఎఫ్‌వో రికవరీ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేపట్టిన న్యాయస్థానం ఉద్యోగికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. భవిష్యనిధి సొమ్ము ఉద్యోగి హక్కు అని, అది చట్టబద్ధంగా అందుకున్న నిధి కాబట్టి తిరిగి చెల్లించాలని కోరడం సమంజసం కాదని పేర్కొంది. మినహాయింపు హోదా రద్దైన తర్వాత భవిష్యనిధి నిధులను ఈపీఎఫ్‌వోకు బదిలీ చేసే బాధ్యత పూర్తిగా సంస్థ యాజమాన్యం, ట్రస్ట్‌పైనే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగితే వాటిపై చర్యలు తీసుకునే అధికారం ఈపీఎఫ్‌వోకు ఉందని, కానీ ఉద్యోగిపై రికవరీ చర్యలు చేపట్ట లేదని తేల్చింది. అలాగే రికవరీ నోటీసులు జారీ చేసే ముందు ఉద్యోగికి వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వకపోవడం, వ్యక్తిగత విచారణకు అవకాశం కల్పించకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కారణాలతో ఈపీఎఫ్‌వో జారీ చేసిన రికవరీ నోటీసులను రద్దు చేసింది. ఈ తీర్పుతో భవిష్య నిధి ఖాతాదారులకు ఊరట లభించగా, నిబంధనల ఉల్లంఘనలకు ఉద్యోగులను బాధ్యులను చేయలేమని హైకోర్టు స్పష్టమైన సందేశం ఇచ్చింది.

# ఢిల్లీలో తొలిసారి ఫెన్సింగ్ ఆసియా కప్..

**జూన్ 19 నుంచి పోటీలు**

**న్యూఢిల్లీ, జూన్ 16**

వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలకు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిన భారత్.. ఇప్పుడు మరో అంతర్జాతీయ క్రీడా మహోత్సవానికి వేదిక కానుంది. ప్రతిష్ఠాత్మక ఫెన్సింగ్ ఆసియా కప్ పోటీలను జూన్ 19 నుంచి 24 వరకు ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఫెన్సింగ్ ఆసియా కప్ టోర్నీ భారత రాజధానిలో జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఆసియా ఖండంతో పాటు మధ్య, దక్షిణ పసిఫిక్ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఫెన్సర్లు ఈ టోర్నీలో పాల్గొననున్నారు. ఫెన్సింగ్ క్రీడలో అత్యంత ప్రతిష్ఠాత్మక వార్షిక పోటీలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ టోర్నీపై క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈసారి పోటీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే క్రీడాకారులకు ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశాలు లభించనున్నాయి. అలాగే



పోటీల ఆధారంగా అంతర్జాతీయ ర్యాంకింగ్ పాయింట్లు కూడా కేటాయించనున్నారు. ఇవి 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ అర్హత ప్రక్రియలో కీలకంగా మారనున్నాయి. టోర్నీ సందర్భంగా ఆసియా ఫెన్సింగ్ సమాఖ్య 39వ సాధారణ సమావేశాన్ని కూడా ఢిల్లీలో నిర్వహించనున్నారు. దీంతో ఆసియా ఫెన్సింగ్ ప్రపంచం మొత్తం భారత వైపు దృష్టి సారించింది. భారత ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజీవ్ మెహతా మాట్లాడుతూ, "దేశంలో తొలిసారి సీనియ ర్ స్థాయి ఆసియా ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం భారత క్రీడా చరిత్రలో ఒక ముఖ్యమై న మైలురాయి. ప్రపంచ స్థాయి ఫెన్సర్లను ఆహ్వానిం చడంతో పాటు 2028 ఒలింపిక్స్ సన్నాహకాలకు ఇది మంచి వేదికగా నిలుస్తుంది. ఈసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వీడియో రిఫరల్ వ్యవస్థను కూడా వినియోగిస్తున్నాం" అని తెలిపారు. ఈ టోర్నీలో భారత ఒలింపియన్ భవానీ దేవితో పాటు మొత్తం 24 మంది భారత ఫెన్సర్లు బరిలోకి దిగనున్నారు. స్వదేశంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో భారత క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# లంక ఆటగాడితో వైభవ్ గొడవ.. ఐసీసీ చర్యలు తప్పవా?

**కొలంబో, జూన్ 16**

శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ, శ్రీలంక-ఏ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ప్రవర్తన చర్చనీయాంశంగా మారింది. సూపర్ ఓవర్‌లో భారత్-ఏ ఓటమి పాలైన తర్వాత మైదానం లో ఇరుజట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ శ్రీలంక ఆటగాడు విషెన్ హాలంబగేతో ఘర్షణకు దిగినట్లు సమాచారం. మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగి ఇరు జట్లు 265 పరుగుల వద్ద సమంగా నిలవడంతో ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించారు. ఇందులో శ్రీలంక-ఏ విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆటగాళ్లు మైదానం వీడుతున్న సమయంలో ఇరు జట్ల మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన వైభవ్ ప్రత్యర్థి ఆటగాడిని తోసేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అక్కడే ఉన్న సీనియర్ ఆటగాడు నిరోషన్ డిక్వెల్లా జోక్యం చేసుకుని ఇరువురిని విడదీయడంతో గొడవ మరింత పెద్దది





కాకుండా ఆగిపోయింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 14 బంతుల్లో 21 పరుగులు చేసి ఆకట్టు కున్నప్పటికీ, అనంతరం జరిగిన ఘటన అతనిపై విమర్శలకు దారితీసింది. శ్రీలంక ఆటగాళ్ల సంబరాలు లేదా రెచ్చగొట్టే వ్యాఖ్య లే ఈ వివాదానికి కారణమై ఉండవచ్చని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. మైదానంలో ఆటగాళ్ల మధ్య భౌతిక ఘర్షణలను అంతర్జాతీయ క్రికెట్ మండలి తీవ్రంగా పరిగణిస్తుంది. ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రత్యర్థి ఆటగాడితో అనుచిత శారీరక సంబంధం లెవల్-1 నేరంగా పరిగణించే అవకాశం ఉంది. దీనికింద జరిమానా, హెచ్చరిక లేదా డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశముంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను మ్యాచ్ రిఫరీ పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. మ్యాచ్ సందర్భంగా వెలుతురు సమస్య, సూపర్ ఓవర్ నిర్వహణపై కూడా వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆటగాళ్లలో ఉద్రిక్తత పెరిగినట్లు తెలుస్తోంది.

# క్రీడా స్టార్టప్‌లకు స్ప్రింట్‌ఎక్స్ వేదిక

**యుజ్వేంద్ర చాహల్**

**హైదరాబాద్, జూన్ 16**

క్రీడలు, ఆరోగ్యం, ఫిట్‌నెస్, సాంకేతిక రంగాలకు చెందిన కొత్త సంస్థల అభివృద్ధికి స్ప్రింట్‌ఎక్స్ ఒక మార్గదర్శక వేదికగా నిలుస్తుందని భారత క్రికెట్ జట్టు ఆటగాడు యుజ్వేంద్ర చాహల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని ఖాజాగూడలో నిర్వహించిన స్ప్రింట్‌ఎక్స్ ప్రారంభోత్స వ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా సాంకేతికత, ఆన్‌లైన్ క్రీడలు, విద్యుదీకృత క్రీడల రంగాల్లో పనిచేస్తున్న కొత్త సంస్థల కోసం రూపొందించిన 'స్ప్రింట్‌ఎక్స్ ప్లేమేకర్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చాహల్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం క్రీడల రూపురేఖలను పూర్తిగా మార్చివేసిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా క్రీడలు, సాంకేతికత మధ్య సంబంధం మరింత బలపడిందని పేర్కొన్నారు. ఆటతీరు విశ్లేషణ, వ్యూహాల రూపకల్పన, శారీరక దృఢత్వం పెంపు, గాయాల నుంచి కోలుకునే ప్రక్రియ వంటి అనేక అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. క్రికెట్‌లో ప్రత్యర్థి బలహీనతలను గుర్తించడం, బౌలింగ్ వ్యూహాలను సిద్ధం చేయడం, ఆటగాళ్ల ప్రదర్శనను విశ్లేషించడం వంటి అంశాల్లో సాంకేతిక వ్యవస్థలు ఎంతో ఉ




పయోగపడుతున్నాయని ఆయన వివరించారు. శిక్షణ అనంతరం శరీరాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం, గాయాల నుంచి వేగంగా కోలుకోవడంలో కూడా ఆధునిక సాంకేతికత సహకరిస్తోందన్నారు. స్ప్రింట్‌ఎక్స్, 360డీ స్పోర్ట్స్ సంస్థల వ్యవస్థాపక భాగస్వామి కార్తిక్ యనమండ్ర మాట్లాడుతూ, క్రీడా రంగంలో వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే కొత్త సంస్థలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా క్రీడా సాంకేతికత, ఆన్‌లైన్ క్రీడలు, విద్యుదీకృత క్రీడల రంగాలకు ప్రత్యేకంగా రూపొందించిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాన్ని 360డీ స్పోర్ట్స్, లెగసీ సంస్థలు సంయుక్తంగా ప్రారంభించాయని చెప్పారు.

# 'టైమ్స్' అత్యంత ప్రభావశీలుల జాబితాలో స్మృతి మంధాన

**న్యూఢిల్లీ, జూన్ 16**



భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత 'టైమ్స్' మ్యాగజైన్ విడుదల చేసిన 2026 సంవత్సరానికి సంబంధించిన 100 మంది అత్యంత ప్రభావశీల క్రీడా వ్యక్తుల జాబితాలో మంధానకు స్థానం లభించింది. ఈ జాబితాలో భారత్ నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. గత కొంతకాలంగా అంత ర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న మంధాన తన బ్యాటింగ్‌తో ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. వ్యక్తిగత విజయాలతో పాటు భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందుకే ఆమెను ఈ ప్రతిష్ఠాత్మక జాబితాకు ఎంపిక చేసినట్లు టైమ్స్ పేర్కొంది. అంతేకాకుండా "రికార్డులు మంధానకు దాసోహం అవుతున్నాయి" అంటూ ప్రత్యేకంగా ప్రశంసించింది. మహిళల క్రికెట్‌లో మంధాన ఎన్నో అరుదైన ఘనతలు సాధించింది.

# తన పేరుతో నకిలీ సోషల్ మీడియా పేజీ.. పోలీసులకు ఫిర్యాదు చేసిన సౌరవ్ గంగూలీ

**, జూన్ 16**



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తన పేరుతో నడుస్తున్న నకిలీ సోషల్ మీడియా ఖాతాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు ఎలాంటి సంబంధం లేకుండా కొందరు వ్యక్తులు ఫేస్‌బుక్ పేజీ లను నిర్వహిస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పోస్టులు చేస్తున్నా రని ఆరోపించారు. 'సౌరవ్ గంగూలీ ఫ్యాన్స్' పేరుతో నడుస్తున్న ఫేస్‌బుక్ పేజీలో తన అభిప్రాయాలుగా తప్పుడు విషయాలను ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే 'స్పోర్ట్స్‌వికీ' పేరుతో ఉన్న మరో సామాజిక మాధ్యమ వేదికపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు కోల్‌కతాలోని ఠాకుర్‌పుకుర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన గంగూలీ, తన గౌరవం, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరంతరం తప్పుడు ప్రచారం జరుగుతోందని ఫిర్యాదులో వివరించారు. తాను ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి కావడంతో ఇలాంటి తప్పుడు ప్రచారం వల్ల ప్రజల్లో తనపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. అసత్య సమాచారం, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు, పరువు నష్టం కలిగించే విషయాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

# మ్యాచ్ ముగియగానే వెళ్లిపోమన్న అమెరికా ఇరాన్ ఆగ్రహం

**లాస్ ఏంజెల్స్, జూన్ 16**

ప్రపంచ ఫుట్‌బాల్ మహాసంగ్రామంలో పాల్గొంటున్న ఇరాన్ జట్టుకు అమెరికా అధికారులు ఇచ్చిన ఆదేశాలు వివాదానికి దారితీశాయి. న్యూజిలాండ్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించుకున్న అనంతరం వెంటనే అమెరికా భూభాగాన్ని విడిచి వెళ్లాలని ఇరాన్ జట్టుకు సూచించడంతో ఆ దేశ కోచ్ అమీర్ ఘలెనోయి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టోర్నీలో పాల్గొనే జట్టుగా తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఇప్పుడు మ్యాచ్ పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలనే ఆదేశం మరింత బాధ కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ జట్టు లాస్ ఏంజెల్స్‌లో కొంతకాలం ఉండి తదుపరి మ్యాచ్‌కు సిద్ధం కావాలని భావించినప్పటికీ, అమెరికా అధికారులు వారిని వెంటనే మెక్సికోలోని టిజువానా శిక్షణ కేంద్రానికి వెళ్లాలని



సూచించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై స్పందించిన ఘలెనోయి, టోర్నీ ప్రారంభం నుంచే తమ జట్టు వివిధ అవరోధాలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. వీసా సమస్యలు, ప్రయాణ ఇబ్బందులు, పరిపాలనా పరమైన ఆటంకాల కారణంగా తమ సహాయక సిబ్బంది, ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు, ఇతర ప్రతినిధులు అమెరికాకు రాలేకపోయారని తెలిపారు. ప్రపంచ వేదికపై తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించడానికి సరైన ప్రతినిధులు కూడా తమతో లేరని ఆయన వాపోయారు. తమ దేశ మీడియా, సమాఖ్య ప్రతినిధులు లేకపోవడం వల్ల తమ పరిస్థితిని ప్రపంచానికి తెలియజేయడం కూడా కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న టోర్నీలో అత్యధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జట్టు తమదేనని ఘలెనోయి వ్యాఖ్యానించారు.



# భారత్ 'ఏ' జట్టులో అశోక్ శర్మకు అవకాశం

**కొలంబో, జూన్ 16**

శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో పాల్గొంటున్న భారత్ 'ఏ' జట్టుకు యువ పేసర్ అశోక్ శర్మ ఎంపి కయ్యాడు. గాయంతో జట్టుకు దూరమైన యుధ్‌వీర్ సింగ్ స్థానంలో అతడిని చేర్చినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటించింది. యుధ్‌వీర్ సింగ్‌కు కుడి భుజంలో అసౌకర్యం తలెత్తడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బెంగళూరులోని అత్యుత్తమ శిక్షణ కేంద్రం లో పునరావాస చికిత్స పొందాలని వైద్య బృందం సూచించింది. దీంతో అతడు సిరీస్ నుంచి తప్పుకోగా, అతని స్థానాన్ని అశోక్ శర్మతో భర్తీ చేశారు. ముక్కోణపు సిరీస్‌లో భారత్ 'ఏ' జట్టు ఇప్పటికే అఫ్గానిస్థాన్, శ్రీలంక జట్ల చేతిలో పరాజయం పాలైంది. వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జట్టులో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలి కాలంలో అశోక్ శర్మ అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. దేశీయ టీ20 టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన అతడు, గత ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి గుర్తింపు పొందాడు. ఆ టోర్నీలో ఆరు మ్యాచ్‌లు ఆడిన అశోక్, గంటకు 154.2 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షించాడు.



# హోరాహోరీ పోరు ఇరాన్, న్యూజిలాండ్ మ్యాచ్ డ్రా

**లాస్ ఏంజెల్స్, జూన్ 16**

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇరాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య సోమవారం జరిగిన ఉత్కంఠభరిత పోరు 2–2తో డ్రాగా ముగిసింది. రాజకీయ ఉద్రిక్తతలు, నిరసనల నడుమ జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు చివరి నిమిషం వరకు పోరాడి ప్రేక్షకులను అలరించాయి. మ్యాచ్ ప్రారంభంలోనే న్యూజిలాండ్ దూకుడుగా ఆడింది. క్రిస్ వుడ్ ఇచ్చిన అద్భుతమైన పాస్‌ను ఎలిజా జస్ట్ గోల్‌గా మలిచి జట్టుకు తొలి ఆధిక్యాన్ని అందించాడు. అయితే ఇరాన్ ఆటగాడు రామిన్ రెజాయన్ 30వ నిమిషంలో డిఫెండర్లను తప్పించుకుని బంతిని గోల్‌పోస్టులోకి పంపడంతో స్కోరు సమమైంది. ద్వితీయార్థంలో మళ్లీ క్రిస్ వుడ్--ఎలిజా జస్ట్ జోడీ మెరిసింది. వారి సమన్వయంతో న్యూజిలాండ్ మరో గోల్ సాధించి 2–1 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మ్యాచ్ ముగింపుకు చేరువలో ఇరాన్ స్టార్ ఆటగాడు మొహమ్మద్ మొహెబ్బీ అద్భుతమైన హెడ్డర్ గోల్ నమోదు చేసి జట్టును ఓటమి నుంచి గట్టెక్కించాడు. దీంతో మ్యాచ్ 2–2తో ముగిసింది. మ్యాచ్‌కు ముందు స్టేడియం వెలుపల ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చోటుచేసుకున్నాయి. వందలాది మంది నిరసనకారులు వివిధ ప్లకార్డులు, పాత జాతీయ జెండాలతో ప్రదర్శనలు నిర్వహించారు. అయినప్పటికీ స్టేడియంలోకి వచ్చిన వేలాది మంది అభిమానులు ఇరాన్ జట్టుకు ఘన మద్దతు తెలిపారు. 70 వేల మందికి పైగా ప్రేక్షకులు "ఇరాన్.. ఇరాన్" అంటూ నినాదాలు చేస్తూ జట్టును ఉత్సాహపరిచారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ దేశీయ ఫుట్‌బాల్ లీగ్ నెలలుగా నిలిచిపోయినా, ఆ జట్టు ఆటగాళ్లు ప్రపంచకప్‌లో పోటీ స్థాయిలో రాణించడం విశేషంగా నిలిచింది. ఇక గ్రూప్-జి పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. మరో మ్యాచ్‌లో బెల్జియం, ఈజిప్ట్ జట్లు 1–1తో డ్రా కావడంతో గ్రూప్‌లోని నాలుగు జట్లు తలో పాయింట్‌తో సమాన స్థితిలో ఉన్నాయి. తదుపరి మ్యాచ్‌లు గ్రూప్ నుంచి ఎవరు ముందుకు వెళ్తారన్న విషయాన్ని నిర్ణయించనున్నాయి. మ్యాచ్ అనంతరం న్యూజిలాండ్ శిబిరం నిరాశ వ్యక్తం చేసింది. రెండుసార్లు ఆధిక్యంలో నిలిచినా విజయాన్ని అందుకోలేకపోయామని పేర్కొంది. అయితే ప్రపంచకప్ వేదికపై ఓటమి లేకుండా కొనసాగడం, రెండు గోల్స్ నమోదు చేయడం తమ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని తెలిపింది.





## సినిమాలకు దూరమైన స్టార్ హీరోయిన్

**ముంబై, జూన్ 16**

ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన సదా ప్రస్తుతం పూర్తిగా భిన్నమైన జీవితాన్ని గడుపుతున్నారు. అందం, అమాయకత్వం, సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఆమె ఇప్పుడు వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్నారు. నితిన్ హీరోగా తెరకెక్కిన 'జయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సదా తొలి సినిమాతోనే ఘన విజయాన్ని అందుకున్నారు. అనంతరం 'అపరిచితుడు' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత ఎన్టీఆర్, బాలకృష్ణ, ఉదయ్ కిరణ్, నితిన్ తదితర స్టార్ హీరోల సరసన నటిస్తూ వరుస అవకాశాలు అందుకున్నారు. కొంతకాలం పాటు తెలుగు, తమిళ భాషల్లో అగ్ర కథానాయికగా కొనసాగిన సదా నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో క్రమంగా అవకాశాలు తగ్గాయి. దీంతో ఆమె సినీ రంగానికి దూరమయ్యారు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే సదా అసలు పేరు సదాఫ్ మొహమ్మద్ సయీద్. మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో ముస్లిం కుటుంబంలో జన్మించిన ఆమె తర్వాత సినీ రంగంలో 'సదా' పేరుతో గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆమె వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు.



## ఓటీటీలోకి కాజల్.. 'విశాఖ'లో లేడీ డాన్‌గా అలరింపు

**హైదరాబాద్, జూన్ 16**

దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కథకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో ముందుకు సాగుతున్న ఆమె, తొలిసారిగా ఓటీటీ ప్రపంచంలో అడుగుపెట్టబోతోంది. 'స్వామి రారా' చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న 'విశాఖ' వెబ్ సిరీస్‌లో కాజల్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సిరీస్‌పై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ సిరీస్‌లో కాజల్ పాత్ర కథకు ప్రధాన బలంగా నిలవనుందని సమాచారం. సాధారణ గృహిణిగా కనిపించే ఆమె, పరిస్థితుల కారణంగా అండర్‌వరల్డ్‌ను శాసించే శక్తివంతమైన మహిళగా మారే పాత్రలో కనిపించనుందని తెలుస్తోంది. అమాయకత్వం, భావోద్వేగం, ఆవేశం, నాయకత్వ లక్షణాలను ఒకే పాత్రలో ఆవిష్కరించే అవకాశం కాజల్‌కు దక్కినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్ సన్నివేశాలకు కూడా ఈ సిరీస్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా లేడీ డాన్ అవతారంలో కాజల్ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు తెలుస్తోంది. ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు కనిపించని స్థాయిలో యాక్షన్ ప్రదర్శన ఈ సిరీస్‌లో ఉండబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినీ పరిశ్రమలో వినిపిస్తున్న కథనాల ప్రకారం, ఈ సిరీస్‌కు మహిళా ప్రధాన కథాంశంతో రూపొందిన ప్రముఖ హిందీ వెబ్ సిరీస్‌ల తరహాలో శక్తివంతమైన కథనం ఉండనుంది. అయితే కథ, పాత్రలు, సంఘటనలు పూర్తిగా కొత్తగా ఉండేలా దర్శకుడు సుధీర్ వర్మ రూపొందించినట్లు సమాచారం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్న 'విశాఖ' వెబ్ సిరీస్ జూలై లేదా ఆగస్టు నెలలో ఓటీటీ వేదికగా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అధికారిక విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముంది. ఇదిలా ఉండగా, కాజల్ అగర్వాల్ సినిమాల పరంగానూ బిజీగా కొనసాగుతున్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. వెబ్ సిరీస్‌లు, సినిమాలు రెండింటిలోనూ బలమైన పాత్రలను ఎంచుకుంటూ కాజల్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత విజయ వంతంగా కొనసాగిస్తున్నారు.

## జూన్ 19న ఆరు సినిమాల బాక్సాఫీస్ పోరు

**హైదరాబాద్, జూన్ 16**

ఈ వారం బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనబోతోంది. జూన్ 19న ఒకేసారి ఆరు విభిన్న కథాంశాలతో తెరకెక్కిన చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానుండటంతో సినీ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. యాక్షన్, కుటుంబ కథా చిత్రం, ప్రేమకథ, భావోద్వేగ నాటకం, సస్పెన్స్ అంశాలతో రూపొందిన ఈ చిత్రాలు థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' ఈ వారంలో అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రంలో కుటుంబ భావోద్వేగాలతో పాటు యాక్షన్ అంశాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు చిత్రబృందం తెలిపింది. విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా నటించిన 'వంద దేవుళ్లు' కూడా అదే రోజున విడుదల కానుంది. గతంలో విజయవంతమైన చిత్రాలను అందించిన దర్శకుడు శశితో కలిసి విజయ్ ఆంటోనీ పనిచేయడం వల్ల ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. చాలా కాలం తర్వాత హీరో వడ్డే నవీన్ 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంతో ప్రేక్ష కుల ముందుకు వస్తున్నారు. రాశి సింగ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం భావోద్వేగ ప్రధాన కథాంశంతో తెరకెక్కినట్లు సమాచారం.



## ఎన్టీఆర్, పవన్‌తో నటించిన నటి ఇప్పుడు ఎక్కడుంది?

**హైదరాబాద్, జూన్ 16**

తెలుగు సినీ పరిశ్రమలో కొన్ని సినిమాలతోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని అభిమానుల మనసుల్లో స్థానం సంపాదించిన హీరోయిన్లలో నివేదా థామస్ ఒకరు. తక్కువ సినిమాలే చేసినప్పటికీ తన సహజమైన నటన, పక్కింటి అమ్మాయి తరహా అందంతో ప్రేక్షకులకు ఎంతో చేరువయ్యారు. కేరళలో జన్మించిన నివేదా థామస్ బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. మలయాళ చిత్రాలతో పాటు పలు టెలివిజన్ కార్యక్రమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం కథానాయికగా మారి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో తన ప్రతిభను చాటుకున్నారు. తెలుగులో నాని హీరోగా తెరకెక్కిన 'జెంటిల్‌మన్' సినిమాతో కథానాయికగా పరిచయమైన నివేదా, తొలి చిత్రంతోనే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత 'నిన్ను కోరి', 'జై లవకుశ', '118', 'బ్రోచేవారెవరురా', 'వకీల్ సాబ్' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ముఖ్యంగా ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మరింత క్రేజ్ పొందారు.





## సింగీతం ప్రతిభకు ఎన్టీఆర్ ప్రశంసలు

**హైదరాబాద్, జూన్ 16**

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటుండగా, తాజాగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచాయి. సినిమాను వీక్షించిన అనంతరం ఎన్టీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. ఈ చిత్రం తన హృదయాన్ని హత్తుకుందని పేర్కొంటూ, 94 ఏళ్ల వయసులోనూ సింగీతం శ్రీనివాసరావు చూపించిన సృజనాత్మకత, కథల పట్ల ఆయనకున్న అంకితభావం తనను ఆశ్చర్యపరిచిందని తెలిపారు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, ప్రతిభకు వయసుతో సంబంధం లేదని ఈ సినిమా మరోసారి నిరూపించిందన్నారు. చిత్రాన్ని నిర్మించిన నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎన్టీఆర్, నాలుగు దశాబ్దాలుగా సింగీతం మనసులో ఉన్న కలను తెరపైకి తీసుకురావడం గొప్ప విషయమని కొనియాడారు. ఒక లెజెండ్ కలను సాకారం చేయడం అరుదైన ఘనత అని పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాసరావుకు ఈ చిత్రం అందమైన నివాళిగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ పనితీరుపైనా ఎన్టీఆర్ ప్రశంసలు కురిపించారు. ఆయన అందించిన సంగీతం సినిమాలోని ప్రతి భావోద్వేగాన్ని ప్రేక్షకులకు చేరవేసిందని, కథను మరింత బలంగా నిలబెట్టిందని చెప్పారు. ప్రతి సన్నివేశంలో సంగీతం ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. అలాగే సినిమా ప్రచారంలో చిత్రబృందం అనుసరించిన వినూత్న విధానం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని ఎన్టీఆర్ తెలిపారు. సాధారణంగా సినిమా విడుదలకు ముందే ట్రైలర్ విడుదల చేస్తారని, అయితే 'సింగ్ గీతం' విషయంలో సినిమా విడుదలైన తర్వాత ట్రైలర్ విడుదల చేయడం ఆసక్తికరంగా అనిపించిందన్నారు.




## 'విశ్వంభర' విడుదలపై కొనసాగుతున్న ఉత్కంఠ

**హైదరాబాద్, జూన్ 16**

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ సోషియో–ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' విడుదల తేదీపై ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై సినీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫాంటసీ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో చిరంజీవి సరికొత్త పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది. అయితే చిత్రీకరణ పూర్తయినప్పటికీ విడుదల తేదీపై అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగినా, అనంతరం ఆగస్టు విడుదలపై వార్తలు వినిపించాయి. కానీ నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో ఆ వార్తలు ఊహాగానాలుగానే మిగిలిపోయాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'విశ్వంభర' చిత్రాన్ని ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు తెలుస్తోంది. పండుగ సీజన్‌లో భారీ చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని సమాచారం. రాబోయే నెలల్లో టాలీవుడ్‌లో పలు స్టార్ హీరోల చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో సరైన విడుదల తేదీ ఎంపిక చేయడం నిర్మాతలకు సవాలుగా మారింది. అలాగే వచ్చే ఏడాది సంక్రాంతి, వేసవి సీజన్లకు కూడా ఇప్పటికే అనేక భారీ ప్రాజెక్టులు ఖరారైనట్లు తెలుస్తోంది. మరోవైపు చిరంజీవి కథానాయకుడిగా దర్శకుడు బాబీ రూపొందిస్తున్న మరో భారీ చిత్రం కూడా వచ్చే ఏడాది విడుదలకు సిద్ధమవుతోందని సమాచారం. ఈ రెండు చిత్రాల మధ్య తగిన విరామం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా త్రిష కథానాయికగా నటిస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467